సాక్షి శ్రీకాకుళం

శనివారం, 9, నవంబర్, 2024




రైతుకు దక్కేనా భీమా

వాతావరణ ఆధారిత పంటల బీమాపై రైతుల్లో అయోమయ స్థితి నెలకొంది. పరిహారంపై స్పష్టత లేదు. - 8లో



చక్రాల కింద నలిగిన ప్రాణం

రెండున్నరేళ్ల చిన్నారి బస్సు చక్రాల కింద నలిగిపోయింది. కంచిలి మండలంలో ఘటన జరిగింది. - 8లో



వడ్డీ కట్టాలంటూ మెసేజ్‌లు

గార ఎస్‌బీఐ ఖాతాదారుల్లో ఆందోళన నెలకొంది. కుదువ పెట్టిన బంగారానికి వడ్డీ కట్టాలంటూ మెసేజ్‌లు వస్తున్నాయి. - 8లో

న్యూస్‌రీల్

జీతాలు, పింఛన్లు చెల్లించాలి

శ్రీకాకుళం కల్చరల్: జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగులకు అక్టోబర్ నెల జీతాలు, పింఛన్లు ఇంకా రాలేదని జిల్లా గ్రంథాలయ సంస్థ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు తమిరి వైకుంఠ రావు ఓ ప్రకటనలో తెలిపారు. పింఛన్‌దారుల ఆరోగ్య పరిస్థితులకు మందులు, ఇంటి అద్దెలు, రేషన్ కొనుగోలుకు, వైద్య ఖర్చులకు ఆర్థిక ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. ఈ సమస్యలు దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఆర్థిక శాఖాధికారికి స్పందించమని కోరుతూ లేఖలు పంపించినట్లు తెలిపారు. త్వరగా స్పందించాలని ఆయన కోరారు.

13 నుంచి ఐటెప్ పరీక్షలు



ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న ఐటెప్ (నాలుగేళ్ల సమీకృత డిగ్రీ కోర్సు) పరీక్షల షెడ్యూల్‌ను వర్సిటీ అధికారులు శుక్రవారం విడుదల చేశారు. ఈ నెల 13వ తేదీ నుంచి 19తేదీ వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి.

జిల్లాకు ఇద్దరు డీఎస్పీలు



వి.వి.అప్పారావు (కాశీబుగ్గ నూతన డీఎస్పీ)

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాకు ఇద్దరు డీఎస్పీలను బదిలీపై పోస్టింగ్ ఇస్తున్నట్లు మంగళగిరి డీజీపీ కార్యాలయం నుంచి శుక్రవారం ఉత్తర్వులు అందాయి. వెయిటింగ్ డీఎస్పీగా ఉన్న జి.సీతా రామారావును శ్రీకాకుళం స్పెషల్‌బ్రాంచి డీఎస్పీగాను, విజయవాడ సీఎస్‌బి–2 డీఎస్పీ గా ఉన్న వీవీ అప్పారావును కాశీబుగ్గ డీఎస్పీగా నియమిస్తున్నట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాశీబుగ్గ డీఎస్పీగా ఇదివరకు పనిచేసిన శ్రీనివాసరావుకు ఉద్యోగోన్నతి లభించి అడిషనల్ ఎస్పీ(క్రైమ్)గా శ్రీకాకుళంలోనే నియమితులయ్యారు. అయినప్పటికీ కొంతకాలంగా కాశీబుగ్గకు డీఎస్పీ లేకపోవడంతో ఇన్‌చార్జి బాధ్యతలు చూస్తున్నారు. ఎన్నికల వరకు జిల్లా స్పెషల్ బ్రాంచిలో డీఎస్పీగా పనిచేసిన ఎ.త్రినాథరావు అనంతరం బదిలీపై వెళ్లడంతో ఇక్కడ కొన్నాళ్లు ఆ పోస్టు ఖాళీగానే ఉండిపోయింది. ఇప్పుడు కొత్త డీఎస్పీ సీతారామారావు వస్తుండటంతో ఆ లోటు తీరినట్లే.

రహదారి భద్రతే.. జీవితానికి రక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: రహదారుల భద్రతే.. జీవితాలకు రక్షణగా నిలుస్తాయని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా రవాణాశాఖ ఆధ్వర్యంలో జిల్లా రహదారుల భద్రతా సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు భద్రతా చర్యల ఆంక్షలను మరింత కఠినతరం చేయాలని ఆదేశించారు. శ్రీకాకుళం నగరం నుంచి నరసన్నపేట వైపు వెళ్లే ఆర్టీసీ బస్సులు తమ్మినాయుడుపేట వైపు రాంగ్ రూట్ లో వెళ్లి జాతీయ రహదారి పైకి వెళ్లరాదని స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే ఆర్టీసీ బస్సులపైనా ఇకపై కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. జిల్లాలో గుర్తించిన బ్లాక్ స్పాట్లు, 158 సున్నితమైన ప్రాంతాల్లో రక్షణ చర్యలపై చర్చించారు. ప్రధాన రహదారుల్లో డివైడర్లను బ్రేక్ చేసి ప్రమాదాలకు అవకాశం కల్పిస్తున్న వారిపై చట్టపరమైన కేసులు నమోదు చేయాలని, నిర్లక్ష్యంగా ఉంటే సంబంధిత ఇంజినీరింగ్ , ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులపై కూడా చర్యలు తప్పవని హెచ్చరించారు 1033 హెల్ప్ లైన్ బోర్డులను తెలుగులో ఏర్పాటు చేయాలని, కాల్ సెంటర్లో తెలుగు మాట్లాడే వారు ఉండేలా చూడాలని సూచించారు.

నవోదయ ప్రవేశాలకు గడువు పెంపు

నరుబుజ్జిలి: వెన్నెలవలస జవహర్ నవోదయ విద్యాలయంలో 2025–26 విద్యాసంవత్సరానికి గాను 9, 11 తరగతుల్లో మిగులు సీట్లలో ప్రవేశానికి గాను దరఖాస్తుకు నవంబర్ 19 వరకు గడువు పెంచినట్లు విద్యాలయం ప్రిన్సిపాల్ డి.పరశురామయ్య శుక్రవారం ప్రకటనలో వెల్లడించారు. ఆన్‌లైన్‌లో నవోదయ వెబ్ సైట్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

● ఆ వేడుకలే..
ఆయువు పెంచే వేదికలు

పదిహేనేళ్ల విద్యార్థి జీవితం

అందమైన పాత జ్ఞాపకంలా గుండె పొరల్లో దాగుండిపోయింది. మూడు దశాబ్దాల ఉద్యోగ జీవితం గతకాలమై మిగిలిపోయింది. రెక్కలొచ్చిన పిల్లలు సొంత గూళ్లు వెతుక్కుంటున్నారు. అరవై ఏళ్ల వయసు దాటాక ఒంటరితనం అనే భూతం వెక్కిరించడం మొదలుపెడుతుంది. ఆ ఒంటరితనాన్ని వదిలించుకునేందుకు జిల్లా కేంద్రంలో కొందరు విశ్రాంత జీవులు ఓ కొత్త పద్ధతిని వెతుక్కున్నారు. పిల్లల పుట్టిన రోజులు, పెళ్లిళ్లు చేసిన ఈ పెద్దవాళ్లు.. ఈ వయసులో తమ పుట్టిన రోజులు, పెళ్లి రోజులు చేసుకోవాలని, అది కూడా స్నేహితుల సమక్షంలో తమ ఇంటిలోనే వేడుకగా జరుపుకోవాలని నిశ్చయించుకున్నారు. ఈ వేడుకలు వారి ఒంటరితనాన్ని దూరం చేస్తున్నాయని చెబుతున్నారు.



మిత్రుని పెళ్లి రోజును వారింట్లో నిర్వహిస్తున్న తోటి మిత్రులు

- ఒంటరితనానికి విరుగుడుగా వేడుకలు
- 60 ఏళ్ల వయసులో పుట్టిన రోజు, పెళ్లి రోజులు చేసుకుంటున్న స్నేహితులు
- విశ్రాంత జీవితంలో విసుగు రాకుండా వినూత్న కార్యక్రమాలు

శ్రీకాకుళం కల్చరల్:

గుండె నిండా అనుభవాలు, మనసు నిండా జ్ఞాపకాలు, శరీరం నిండా నొప్పులు.. వెరసి అరవై దాటిన వయసుకు సంకేతాలు. ఇలా అరవై దాటిన వారంతా మళ్లీ ఇరవైల్లోకి వెళ్లిపోతున్నారు. శ్రీకాకుళంలోని మున్సిపల్ హైస్కూల్‌లో 1976లో టెన్త్ చదివిన వారు ఓ కొత్త పద్ధతిని కనిపెట్టారు. తోటి విశ్రాంతజీవులు కూడా ఒంటరిగా ఫీలైతే ఈ పద్ధతిని ఫాలో కావచ్చని చెబుతున్నారు.

యాభై ఏళ్ల జ్ఞాపకాలు నెమరువేసుకుని..

1976 నాటి రోజుల్లో ఈ హైస్కూల్‌లో టెన్త్‌కు 'ఎ' నుంచి 'హెచ్' వరకు సెక్షన్లు ఉండేవి. ఆ బ్యాచ్‌లో చదువుకున్న వారంతా పదేళ్లుగా ఎక్కడో ఓ చోట కలుసుకుంటున్నారు. ప్రతి ఆత్మీయ కలయికకు కనీసం 150 నుంచి 180 మంది వరకు హాజరై నాటి



ఒక మిత్రుని జన్మదిన వేడుక నిర్వహిస్తూ..

జ్ఞాపకాలు నెమరువేసుకుంటున్నారు. కానీ అది వారికి సరిపోవడం లేదు. వయసు పెరుగుతున్న కొద్దీ స్నేహితులు మాత్రమే మిగిలి మిగతా అంతా దూరమైపోవడంతో.. అంతా మళ్లీ మళ్లీ కలుసుకోవడానికి పెళ్లిరోజులు, పుట్టిన రోజులు చేసే విధంగా నిర్ణయించుకున్నారు.

కష్టసుఖాలు పంచుకునేలా..

మనం సాధారణంగా ఇళ్లలో చిన్నారులకు ఎక్కువగా పుట్టిన రోజులు ఘనంగా నిర్వహిస్తాం. అలాగే కొందరు పెళ్లిరోజులు, పుట్టిన రోజులు కూడా మర్చిపోయి తమ జీవితం కుటుంబానికే అంకితం చేస్తారు. ఈ 60ఏళ్ల వయసులో ఒక్కో ఏడాది ఒక్కో తరహాలో పుట్టిన రోజులు కొన్నాళ్లు, పెళ్లిరోజులు కొన్నాళ్లు నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. అందుకోసం ఎవరి పుట్టిన రోజు చేద్దామనుకుంటున్నారో వారి ఇంటి వద్ద వారి కుటుంబ సభ్యుల సమక్షంలో వేడుక చేయడానికి సంకల్పించారు. ఇలా అయితే ప్రతి నెలా అందరం కలిసి కష్టసుఖాలు పంచుకోవచ్చన్నది వారి ఆలోచన. దీంతో ప్రతి ఇంటిలోనూ ఏదో వేడుక నిర్వహించేలా ప్లాన్ చేసుకుని విశ్రాంత జీవితాన్ని విశ్రాంతిగా గడుపుతున్నారు.

ఆపదలో మిత్రులకు అండగా..

కలిసి వేడుక చేసుకోవడమే కాదు.. కష్టాల్లో ఉన్న సహచరులను ఆదుకోవడంలో కూడా ఈ బ్యాచ్ ముందుంది. గత పదేళ్లుగా అవసరమైన తమ మిత్రుల కుమార్తె పెళ్లిళ్లకు, వైద్య ఖర్చుల కోసం, ఇటీవల వచ్చిన కోవిడ్ సమయంలో కొందరిని ఆర్థికంగా ఆదుకున్నారు. స్థానిక బెహరా మనోవికాస కేంద్రం చిన్నారులకు వారి పెళ్లి రోజున, పుట్టిన రోజున దుప్పట్ల పంపిణీ, అన్నదానం తదితర సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. తిత్లీ తుఫాన్ సమయంలోనూ ఈ బ్యాచ్ వారంతా కలసి దుప్పట్లను పంచి పెట్టారు.



మా ఆరోగ్యం పెంచుకుంటున్నాం



మేం ఎప్పటికప్పుడు కలుస్తాం. ఇలా కలవడం వల్ల మా ఆరోగ్యాలు బాగుంటున్నాయి.

– పి.శారద, పద్మావతి నగర్‌కాలనీ, శ్రీకాకుళం

పుట్టినరోజులు, పెళ్లి రోజులు చేసుకుంటాం



మేము మా స్నేహితుల పుట్టిన రోజులు, పెళ్లి రోజులు కుటుంబ సభ్యుల సమక్షంలో చేసుకుంటాం. రిటైరైన వారు మమ్మల్ని అనుసరిస్తే బాగుంటుంది. రాబోయే తరం వాళ్లు కూడా చూడాలి.

– పి.శ్యామ్ సుందర్, రిటైర్డ్ తహసీల్దార్, శ్రీకాకుళం

పేద విద్యార్థులకు సాయం



మేము గ్రూప్‌గా ఏర్పడిన తర్వాత ఎందరికో సాయం చేశాం. ఇప్పటివరకు దాదాపు రూ.8లక్షల వరకు సాయం అందించాం. బెహరా మనోవికాస కేంద్రం చిన్నారులకు, తిత్లీ తుఫాను బాధితులకు సాయం అందించాం.

– కిల్లాన ఫల్గుణరావు, రిటైర్డ్ ఏసీటీఓ, శ్రీకాకుళం

నా కుమార్తె పెళ్లికి సాయం చేశారు



మా మిత్రులంతా కలిసి నా కుమార్తె పెళ్లికి సాయం అందించారు. నా ఆర్థిక పరిస్థితి గమనించి నా మిత్రులంతా సాయం చేశారు. ఆరోగ్యం బాగులేకపోయినా చూసుకుంటున్నారు. ఇలాంటి మిత్రులు ఉండడం నాకు గర్వకారణం. – దూసి గిరి, అరసవల్లి

బెల్టుషాపు నిర్వహణకు వేలం

నందిగాం: మండలంలోని పెద్దతామరాపల్లిలో బెల్టుషాపు నిర్వహించుకునేందుకు వేలం వేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానిక తెలుగుదేశం నాయకుని ఆధ్వర్యంలో గ్రామంలో ఉన్న ఆంజనేయస్వామి ఆలయం వద్ద నిర్వహించిన వేలం పాటలో గ్రామానికి చెందిన ఓ వ్యక్తి రూ.4లక్షల 15వేలుకు పాడుకొని స్థానిక బజారులో నిర్భయంగా నడుపుకుంటున్నారు. నంది గాం మండలంకు రెండు షాపులు కేటాయించడంతో ఒక షాపు నందిగాంలో పెట్టి మరోషాపు కొండలప్రాంతంలో పెట్టడానికి ప్రణాళికలు వేసుకుంటున్నారు. ప్రభుత్వం బెల్టు షాపులు నిర్వహించకూడదని చెబుతున్నా స్థానిక తెలుగుదేశం నాయకులు దగ్గరుండి మరీ వేలం వేయించి బెల్టుషాపులకు ప్రోత్సహించడంపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

మళ్లీ పులి అలికిడి



ఆంధ్రా–ఒడిశా సరిహద్దు గ్రామంలో ప్రజల్ని అప్రమత్తం చేస్తున్న అటవీ శాఖ సిబ్బంది

ఇచ్ఛాపురం రూరల్: మళ్లీ పులి అలికిడి వినిపిస్తోంది. ఒడిశా చీకటికి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న అడవిలో పెద్దపులి సంచరిస్తున్నట్లు ఒడిశా అటవీశాఖాధికారులు అక్కడ ప్రజల్ని అప్రమత్తం చేశారు. ఈ నేపథ్యంలో శుక్రవారం కాశీబుగ్గ రేంజ్ అధికారి మురళీకృష్ణంనాయుడు ఆదేశాలు మేరకు డీఆర్‌ఓ ఐ.రాము, బీట్ ఆఫీసర్లు పి.భానుమూర్తి, సురేష్‌లు ఆంధ్రా–ఒడిశా సరిహద్దు గ్రామాలు ముచ్చింద్ర, కేదారిపురం, బెన్నుగానిపేట, బాలకృష్ణాపురం, ముల్లభద్ర, పురుషోత్తపురం గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశారు. రాత్రి సమయాల్లో ఒంటరిగా పంట పొలాలకు వెళ్లరాదని, గుంపులుగా ఉండాలని, పశువులకు సరైన భద్రత కల్పించాలని, సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వదంతులు నమ్మరాదని సూచించారు.

17 నుంచి ధాన్యం సేకరణ

- ఒడిశా ధాన్యంకు అడ్డుకట్ట వేయాలి
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో పండించిన ధాన్యాన్ని ప్రతి గింజ కొనుగోలు చేయాలని, ఒడిశా నుంచి దిగుమతి చేస్తున్న ధాన్యానికి అడ్డుకట్ట వేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. జిల్లాలో ధాన్యం కొనుగోళ్లపై కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, శాసన సభ్యులతో కలిసి శుక్రవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లా ఈ నెల 17 నుంచి రైతులు పండించే ధాన్యాన్ని సేకరిస్తామన్నారు. మార్కెటింగ్, పీఏసీఎస్‌లు, స్వయం సహాయక సంఘాల ద్వారా సేకరణకు చర్యలు చేపట్టాల ని ఆదేశించారు. ధాన్యం సేకరణ కేంద్రాలు ఎన్ని ఉండాలో పరిశీలించి చర్యలు తీసుకోవాలన్నారు. ధాన్యం కొనుగోలుకు నిబంధనలు ఎలాంటి నియ మ, నిబంధనలు ఉండవని, రైతులు ఎక్కడ కావాలంటే అక్కడ విక్రయాలు చేసుకోవచ్చని వెల్లడించారు. గత ఐదేళ్లుగా ఏ రైస్ మిల్లు ఎన్ని ధాన్యాన్ని సేకరించిందో ఆ వివరాలను తెలియజేయాలన్నారు. రైతు ల నుంచి ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లో ప్రభుత్వం డబ్బులు చెల్లిస్తుందని చెప్పారు.

తడి ధాన్యం వద్దు..

జిల్లా రైతులు తడి ధాన్యాన్ని తీసుకు రాకూడదని, ధాన్యం తడిగా ఉంటే ఆరబెట్టి కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకురావాలని ఆయన కోరారు. బ్యాంకర్లు గ్యారంటీలు సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు. గతంలో ధాన్యం సేకరణ చేసి రైతులకు డబ్బు ఇవ్వని మిల్లులు ఉన్నాయా అని మంత్రి అడుగగా అలాంటివేమీ లేదని డీఎం చెప్పారు. మిల్లర్లకు బకాయిలు ఉన్న వివరాలను మంత్రి పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్‌ను అడుగగా బకాయిలు ఉన్నాయని డీఎం వివరించారు.గోడౌన్లు ఈ ఏడాది వినియోగంలోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ ధాన్యం సేకరణ నాటికి సిబ్బందిని ఏర్పాటు చేస్తామన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ మాట్లాడుతూ కస్టోడియన్ ఆఫీసర్లుగా సీఎస్‌డీటీలను నియమిస్తామని చెప్పారు.

కక్ష సాధింపులు ఉండవు..

సమీక్ష అనంతరం మంత్రి విలేకరులతో మాట్లాడారు. సీఎం ఐదు నెలలుగా ప్రజాస్వామ్యబద్ధంగా పాలిస్తున్నారని చెప్పారు. కక్ష సాధింపులకు పాల్పడడం లేదని అన్నారు. ఎవరైనా మహిళలపై అసభ్యకరంగా పోస్టింగులు పెడితే చర్యలు తప్పవన్నారు.

నౌపడ–గుణుపూర్ మార్గంలో పలు రైళ్లు రద్దు

టెక్కలి: నౌపడ–గుణుపూర్ బ్రాడ్‌గేజ్ రైలు మార్గంలో ట్రాక్ కెపాసిటీ పనుల నేపథ్యంలో నిర్ణయించిన తేదీల్లో పలు రైళ్ల రాకపోకలను రద్దు చేస్తున్నట్లు సీనియర్ డీఈఎన్ రమణారావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 13, 16, 17, 20, 23, 24 తేదీల్లో విశాఖ–గుణుపూర్, రూర్కెలా–గుణుపూర్ రైళ్ల రాకపోకలను రద్దు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ట్రాక్ కెపాసిటీని 50 కిలోమీటర్ల స్పీడ్ నుంచి 75 కిలోమీటర్ల స్పీడ్ పెంచేందుకు పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

ప్రొటోకాల్ ఉల్లంఘిస్తే సహించేది లేదు

- గ్రామ సభల తీర్మానాలకు విరుద్ధంగా పనులా..?
- అసహనం వ్యక్తం చేసిన జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ
- వెండర్ విధానంపై జెడ్పీ సమావేశంలో గొంతెత్తిన జెడ్పీటీసీలు
- వాడీవేడిగా జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు





మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ విజయ, పక్కనే జెడ్పీ సీఈఓ శ్రీధర్‌రాజా , హాజరైన జెడ్పీటీసీలు, అధికారులు

అరసవల్లి: ప్రజా ప్రతినిధులకు ఏ మాత్రం విలువ ఇవ్వకుండా, గ్రామసభల తీర్మానాలను పట్టించుకోకుండా గ్రామాల్లో ఇష్టానుసారం పనులు చేపట్టడం తగదని జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాపరిషత్ సీఈఓ శ్రీధర్ రాజా ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన 1వ, 2వ, 4వ, 7వ స్థాయీ సంఘ సమావేశాలకు ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. తర్వాత సెషన్‌లో 3వ స్థాయీ సంఘ సమావేశానికి జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పాలిన శ్రావణి, 5వ స్థాయీ సంఘ సమావేశానికి జంపు కన్నతల్లి, 6వ స్థాయీ సమావేశానికి జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్‌మోహన్‌రావు అధ్యక్షత వహించారు.

'వెండర్' విధానంపై రచ్చ

జాతీయ ఉపాధి హామీ పనుల కేటాయింపు అంశంలో జెడ్పీ చైర్‌పర్సన్ విజయ మాట్లాడుతూ.. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ అధికారంలో లేకపోయినా, స్థానికంగా మాత్రం ఆ పార్టీ నాయకులే అధికారంలో ఉన్నారని తెలిపారు. ఉపాధి పనుల గుర్తింపు, కేటాయింపునకు సర్పంచ్ అధ్యక్షతన గ్రామ సభ తీర్మానాలు తప్పనిసరని, కానీ ఇప్పుడు 'వెండర్' విధానాన్ని ప్రభుత్వం తీసుకురావడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. అధికారులు జాతీయ ఉపాధి హామీ చట్టం ప్రకారం నడుచుకోవాలని సూచించారు. జిల్లాలో చాలా చోట్ల సర్పంచ్‌లకు ప్రొటోకాల్ పాటించకుండా అధికారులు వ్యవహరిస్తున్న తీరును ఆమె తప్పుపట్టారు. ఇలాంటి ఘటనలపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానన్నారు. ఇదే అంశంపై రణస్థలం జెడ్పీటీసీ టొంపల సీతారాం మాట్లాడుతూ వెండర్ విధానంతో 'స్థానిక' అధికారాలున్న తమలాంటి ప్రజాప్రతినిధులను కాదని, సర్పంచ్‌ల తీర్మానాలను పక్కన పెట్టి మరీ ప్రభుత్వం టీడీపీ కార్యకర్తలకే పనులు కట్టబెడుతోందని ఆరోపించారు. గ్రామ సభ తీర్మానాలకు మాత్రమే 'స్థానిక' ప్రజాప్రతినిధులు కావాలని, పనుల కేటాయింపునకు మాత్రం అవసరం లేదన్నట్లుగా ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. ఇలాగే ముందుకెళ్తే కోర్టులను ఆశ్రయిస్తామన్నారు. అనంతరం కోటబొమ్మాళి జెడ్పీటీసీ దుబ్బ వెంకటరావు, సంతబొమ్మాళి జెడ్పీటీసీ పాల వసంతరా వు, సరుబుజ్జిలి జెడ్పీటీసీ నాగేశ్వరరావు తదితరులు మాట్లాడుతూ వెండర్ విధానం 'స్థానిక' అధికారాలకు టెండర్ పెడుతోందన్నారు.

డీఈఓ తీరుపై మండిపాటు..

విద్యాశాఖ ప్రగతిని నివేదిస్తూ డీఈఓ తిరుమల చైతన్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 'మన బడి–మన భవిష్యత్' పేరిట అద్భుత కార్యక్రమాలను నిర్వహిస్తోందని, త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా ఇక్కడ జరిగిన అభివృద్ధి, పిల్లల భవిష్యత్‌లపై చర్చించేలా పేరెంట్ టీచర్ మీటింగ్ (పిటిఎం)లను నిర్వహిస్తున్నారని, దీంతో గిన్నిస్‌బుక్‌లో స్థానం సంపాదించనున్నట్లుగా వివరించారు. దీనిపై జెడ్పీ చైర్ పర్సన్ జోక్యం చేసుకుంటూ.. 'అధికార పార్టీని పొగుడుకోండి.. ఫర్వాలేదు.. కానీ నాడు–నేడు ద్వారా బడుల రూపురేఖలు మార్చింది వైఎస్ జగన్.. గిన్నిస్‌లో స్థానం వచ్చినా ఆ ఘనత వైఎస్ జగన్‌దే' అని చెప్పడంతో జెడ్పీటీసీలంతా బల్లలు చరిచారు. ప్రస్తుతం మధ్యాహ్న భోజనాలు బాగులేవని పిల్లలు ధర్నాలు చేస్తున్నారని అన్నారు. దీనిపై నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి స్పందిస్తూ 2014–19 మధ్యలో తమ ప్రభుత్వమే నిధులు విడుదల చేసిందన్నారు.

వైద్యశాఖలో నకిలీలపై...

జిల్లా వైద్యారోగ్యశాఖలో నకిలీ ఉద్యోగాలు, నకిలీ జాయినింగ్ ఆర్డర్ల జారీ వంటి దారుణాలేంటని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ డీఎంహెచ్‌ఓ డాక్టర్ మీనాక్షిని ప్రశ్నించారు. గత కొంతకాలంగా శాఖలో ఇదో పెద్ద దళారీ వ్యవస్థ పనిచేస్తుందని తనకు ఫోన్‌కాల్స్, ఫిర్యాదులు వచ్చాయని దీనిపై చర్యలు చేపట్టాలని ఆమె ఆదేశించారు. దీనిపై డీఎంహెచ్‌ఓ మీనాక్షి మాట్లాడుతూ తమ శాఖలో ఎలాంటి ఉద్యోగమైనా నోటిఫికేషన్, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రాతిపదికనే ఉద్యోగాల భర్తీ జరుగుతుందని, దళారులను నమ్మి మోసపోవద్దని నిరుద్యోగులకు సూచిస్తున్నట్లుగా ఆమె వివరించారు.





గెలుపు పొందు వరకు.. అలుపు లేదు మనకు

శ్రీకాకుళంలోని నాగావళి నది తీరంలో యువత పరుగులు పెడుతున్నారు. పోలీస్, ఆర్మీ సెలెక్షన్ల కోసం ఇసుకపై రన్నింగ్ ప్రాక్టీస్ చేస్తున్నారు. వేకువజామున మంచులో ఇసుక తిన్నెలపై పరిగెడుతూ రాటుదేలుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం

క్లుప్తంగా

చీరకు నిప్పంటుకొని మహిళ మృతి


కుందు గురమ్మ(ఫైల్)

గార: మండలంలోని బందరువానిపేట దుమ్ము వీధిలో కుందు గురమ్మ (60) అనే మహిళ చీరకు నిప్పంటుకోవడంతో శరీరమంతా కాలిపోయి మృతి చెందింది. గురువారం మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో తన డాబా ఇంట్లో దీపం పెట్టే సమయంలో చీర కొంగుకు నిప్పంటుకుంది. పెద్దగా కేకలు వేయడంతో ఇరుగుపొరుగు వారు వచ్చి మంటలార్పే ప్రయత్నం చేశారు. అనంతరం 108 అంబులెన్సులో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించి, మెరుగైన చికిత్స కోసం విశాఖపట్నం కేజీహెచ్‌లో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందింది. గురమ్మకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. గురమ్మకు కొద్ది నెలల క్రితం పక్షవాతం రావడంతో ఒక కాలు సరిగ్గా పనిచేయడం లేదు. అందుకే ప్రమాదం నుంచి తప్పించుకోలేకపోయింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ ఆర్.జనార్దన తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి


వెంకటరావు(ఫైల్)

సారవకోట: మండలంలోని అలుదు సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన మాకివలస గ్రామానికి చెందిన ఎస్.వెంకటరావు(35) కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. సారవకోట నుంచి అలుదుకు ద్విచక్ర వాహనంపై వస్తుండగా ఎదురుగా వస్తున్న కారు ఢీ కొనడంతో వెంకటరావు గాయపడ్డారు. తొలుత నరసన్నపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా.. పరిస్థితి విషమించడంతో విశాఖ కేజీహెచ్‌లో చేర్పించారు. అక్కడి చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందాడు. వెంకటరావుకు భార్యతో విడాకులు కావడం, తల్లిదండ్రులు సైతం మృతి చెందడంతో ఒక్కడే ఉంటున్నాడు. మేనమామ కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సారవకోట పోలీసులు కేసు నమోదు చేశారు.

పాముకాటుతో యువకుడు మృతి


హరీష్(ఫైల్)

బూర్జ: మండలంలోని తోటవాడ గ్రామానికి చెందిన కొత్తకోట హరీష్ (25) పాము కాటుకు గురై మృతిచెందాడు. హరీష్ శుక్రవారం ఉదయం వ్యవసాయ క్షేత్రంలో యంత్రంతో వరి కోత చేస్తుండగా పాము కాటు వేసింది. వెంటనే తోటివారు పాలకొండ ఏరియా ఆస్పత్రికి ఆటోలో తరలించారు. అప్పటికే హరీష్ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. హరీష్‌కు తల్లి పద్మావతి, తండ్రి సింహాచలం, వివాహమైన ఇద్దరు అక్కలు ఉన్నారు. కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉంటాడనుకున్న హరీష్ మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమవుతున్నారు.

పంటల బీమా..
రైతుకు దక్కేనా ధీమా!

- ప్రీమియం చెల్లింపునకు తుది గడువు ఈ నెల 15
- పరిహారంపై స్పష్టత కరువు

కవిటి:

ప్రభుత్వం ఈ ఏడాది ప్రవేశపెట్టిన వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం తమను ఆదుకుంటుందా లేదా అన్న మీమాంస జీడి, మామిడి రైతుల్లో నెలకొంది. జిల్లాలో గిరిజన, అటవీ, మైదాన ప్రాంతాల్లో సుమారు 50,000 ఎకరాల్లో జీడి మామిడి సాగులో ఉంది. ప్రతికూల వాతావరణ పరిస్థితులు, ప్రకృతి వైపరీత్యాల సమయంలో రైతులు నష్టపోకుండా ఉండేందుకు ప్రభుత్వం 'వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం' పేరిట పంటల బీమా సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చింది. వర్షపాతం, ఉష్ణోగ్రత, గాలిలో తేమ వంటి ప్రతికూల వాతావరణ పరిస్థితులు ఏర్పడితే పంట నష్టాల పరిహారాన్ని ఈ పథకం ద్వారా పొందవచ్చు. నవంబర్ 15లోగా రైతులు తమవంతు ప్రీమియం చెల్లించాల్సి ఉంది.


కవిటి ఉద్దానంలో సాగులో ఉన్న జీడితోటలు

అర్హులు ఎవరంటే..



- 2024–25లో ఈ–క్రాప్‌లో నమోదైన జీడి మామిడి రైతులు, కౌలు రైతులు అర్హులు.
- ప్రభుత్వరంగ బ్యాంకులు, ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు, ఇతర బ్యాంకుల్లో వ్యవసాయ రుణం పొందిన రైతులు తప్పనిసరిగా వాతావరణాధారిత పంటల బీమా పథకంలో నమోదై ఉండాలి.
- రుణం పొందని రైతులు ఎవరికి వారే స్వయంగా ఉద్యాన శాఖ సహాయంతో ప్రీమియాన్ని సంబంధిత మీ–సేవ కేంద్రంలో చెల్లించి పథకానికి దరఖాస్తు చేసుకోవాలి.

ఐదు శాతం ప్రీమియం..

ఈ–పంట నమోదు చేసుకున్న రైతులు తమ వాటా కింద ఐదు శాతం మొత్తాన్ని నేరుగా ప్రీమియం రూపంలో చెల్లించుకోవాలి. ఎకరానికి రూ.80000 బీమాపరిహారం అందించే ఈ పథకానికి రైతులు తమ వాటాగా రూ.1600 ప్రీమియం చెల్లించాల్సి ఉంది. ఈ పథకం ద్వారా సకాలంలో పంటల బీమా పరిహారం నేరుగా రైతుల బ్యాంకు ఖాతాకు జమవుతుంది.

ఈ పత్రాలు తప్పనిసరి..



- ఆధార్ కార్డు
- భూమి యాజమాన్య హక్కు పత్రం(1–బీ)
- కౌలు రైతు గుర్తింపు సర్టిఫికెట్
- సచివాలయం రైతు సేవా కేంద్రం అధికారి జారీచేసిన పంట నమోదు ధ్రువీకరణ పత్రం
- రైతు ఫోన్ నంబరు
- బ్యాంకు ఖాతా మొదటి పేజీ

సందేహాలెన్నో..

పథకం వర్తించాలంటే నష్టాల లెక్కింపును మదింపు చేయడంలో గ్రామమా, మండలమా, జిల్లాను యూనిట్‌గా తీసుకుంటారా అన్నదానిపై స్పష్టత లేదు. పథకం రూపకల్పన చేసిన ఉద్యానశాఖ అధికారులకు, వాతావరణ వివరాలు వెల్లడించాల్సిన రెవెన్యూశాఖకు ఈ అంశాలపై సమన్వయం ఏ మేరకు జరుగుతుందన్న అంశంపై అనుమానాలు ఉన్నాయి. ప్రధానంగా పరిహారం చెల్లుబాటుకు అవసరమైన వాతావరణ పరిస్థితుల్ని పక్కాగా ఫిక్స్ చేసే యంత్రాంగం సకాలంలో వివరాలను బీమా కంపెనీలకు చేర్చడమే పథకంలో కీలకాంశాలు. ఇవన్నీ వందశాతం జరిగితే తప్ప బీమా కంపెనీలు పరిహారం చెల్లించవు.

నిబంధనల మేరకే..



నిబంధనల మేరకే వాతావరణ ఆధారిత పంటల బీమా పథకాన్ని జీడి రైతుకు అమలు చేస్తాం. ఈ–క్రాప్‌లో నమోదైన రైతులే అర్హులు. కౌలు రైతులు ప్రభుత్వం జారీ చేసిన ధ్రువీకరణ పత్రాలు విధిగా కలిగి ఉండాలి.

– పోలాకి మాధవీలత, మండల ఉద్యానశాఖ అధికారి, కవిటి

పారదర్శకంగా అందాలి..



గ్రామం యూనిట్‌గా తీసుకుని వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం అమలైతేనే రైతుకు నిజమైన ప్రయోజనం లభిస్తుంది. నిబంధనల్లో ఇచ్చిన మూడు దశలకు తొలి దశలో జరిగిన నష్టం పంట మొత్తంపై ఉంటుంది కాబట్టి కోలుకునే ప్రశ్నే ఉండదు. తొలిదశలో నష్టానికి కూడా పూర్తిపరిహారం అందిస్తేనే న్యాయం జరిగినట్టు లెక్క.

– ఎన్ని అశోక్, జీడి రైతు, చండిపురం, కవిటి మండలం

పరిహారం అందే తీరిదీ..		
బీమా వర్తించే వాతావరణ పరిస్థితులు	కాలవ్యవధి	వర్తించే బీమా(హెక్టారుకు)
అకాల, అధిక వర్షాలు	15-11-2024 .. 31-01-2025	రూ.32000 వరకు
వ్యాధుల వ్యాప్తికి అనుకూల వాతావరణం	01-11-2024 .. 28-02-2025	రూ.32000 వరకు
అధిక ఉష్ణోగ్రతలు	01-02-2025 .. 30-04-2025	రూ.16000 వరకు

ఎల్‌ఎల్‌బీలో మిగులు సీట్లు 27

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలోని న్యాయ విద్యలో మొదటి విడత లాసెట్- 2024 కౌన్సెలింగ్ శుక్రవారంతో పూర్తయ్యింది. మొత్తం 66 సీట్లకు గాను 39 ప్రవేశాలు జరిగాయి. 27 సీట్లు మిగిలిపోయాయి. శుక్రవారం సాయంత్రంతో రిపోర్టింగ్ ముగియడంతో త్వరలోనే క్లాస్‌వర్కు ప్రారంభిస్తామని కోర్సు కో–ఆర్డినేటర్ వై.రాజేంద్రప్రసాద్ చెప్పారు. రెండో కౌన్సెలింగ్‌లో వర్సిటీ కళాశాల ఆప్షన్‌కు అవకాశం ఉందని తెలిపారు.

12న జాబ్‌మేళా

సోంపేట: మండలంలోని బారువ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 12న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ డి.రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐ, డిగ్రీ (బీఎస్సీ/బీఈడీ) 18–26 ఏళ్ల వయసు కలిగిన నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రెండు కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహిస్తాయని, పూర్తి వివరాలకు 95028 25143 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఉత్తమ పాలిటెక్నిక్ లెక్చరర్‌గా మురళీకృష్ణ


మురళీకృష్ణ

ఎచ్చెర్ల క్యాంపస్: పాలిటెక్నిక్ కళాశాలల విభాగంలో రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల కంప్యూటర్ ఇంజినీరింగ్ సీనియర్ లెక్చరర్ డి.మురళీకృష్ణ ఎంపికయ్యారు. ఈ మేరకు సాంకేతిక విద్యాశాఖ నుంచి శుక్రవారం సమాచారం అందింది. కళాశాల ప్రగతికి, విద్యాప్రమాణాలు మెరుగుకు నిరంతరం శ్రమించే మురళీ కృష్ణకు అవార్డు వరించడం పట్ల తోటి అధ్యాపకులు అభినందించారు. కాగా, రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ఎంపిక ఇటీవల వాయిదా పడిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ నెల 11న విజయవాడలో అవార్డులు అందజేయనున్నారు.

సంక్షేమ పథకాలపై ప్రశ్నిస్తే కేసులా?

- టెక్కలి వైఎస్సార్ సీపీ సమన్వయకర్త పేరాడ తిలక్

కోటబొమ్మాళి: సంక్షేమ పథకాలను అమలు చేయాలని సోషల్‌మీడియాలో ప్రశ్నిస్తున్న వైఎస్సార్ సీపీ సైన్యంపై కేసులు పెట్టడం తగదని టెక్కలి వైఎస్సార్ సీపీ సమన్వయకర్త పేరాడ తిలక్ అన్నారు. శుక్రవారం కోటబొమ్మాళి ఎంపీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, మంత్రి అచ్చెన్నాయుడులు సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేయలేక దుర్మార్గ పాలనకు తెరలేపారని దుయ్యబట్టారు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ వర్తింపజేయకుండా మోసం చేశారని మండిపడ్డారు. అమరావతికి మద్దతు తెలిపినందుకే కింజరాపు కుటుంబీకులకు రెండు మంత్రి పదవులు ఇచ్చారని చెప్పారు. గత ఎన్నికల్లో టీడీపీకి మద్దతు పలకలేదన్న కోపంతో మంత్రి అచ్చెన్నాయుడు వివిధ విభాగాల్లో 400 మందిని ఉద్యోగాల నుంచి తొలగించారని ఆరోపించారు. పోలీసులను, ప్రభుత్వాధికారులను భయపెట్టి పాలన సాగించడం సిగ్గుచేటన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలను పిలవకుండా టీడీపీ కార్యకర్తలే ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహించడం తగదన్నారు. జగనన్న పాలనలో ఇచ్చిన ఇళ్ల పట్టాలను రద్దు చేయడం దారుణమన్నారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా వైఎస్సార్ సీపీ విజయం సాధించడం ఖాయమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు రోణంకి మల్లయ్య, బోయిన నాగేశ్వరరావు, నూక సత్యరాజు, సంపతిరావు హేమసుందరరాజు, పేడాడ వెంకటరావు, దుక్క రామకృష్ణ, రాంపాత్రుని శివారెడ్డి, తలగాన గణపతిరావు, నేతింటి సింహాచలం, పొన్నాన మోహనరావు, గుంట సోమేశ్వరరావు, బొడ్డు వెంకటరమణ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పేరాడ తిలక్

డీఎస్సీ ఉచిత శిక్షణ పరీక్ష వాయిదా

శ్రీకాకుళం పాతబస్టాండ్: సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీలకు డీఎస్సీ పరీక్షకు ఉచిత శిక్షణ ఇచ్చేందుకు నిర్వహించాల్సిన స్క్రీనింగ్ పరీక్షను వాయిదా వేసినట్లు సాంఘిక సంక్షేమ శాఖ డీడీ వై.విశ్వమోహన్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల కోడ్ కారణంగా వాయిదా పడిందని పేర్కొన్నారు.

కారును ఢీకొట్టిన లారీ


ప్రమాదానికి గురైన కారు

కంచిలి:మండలంలోని జాడుపూడి వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం పలాస నుంచి ఇచ్ఛాపురం వైపు వెళుతున్న కారును వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొట్టింది. కారు పల్టీ కొట్టి రోడ్డు పక్కన సీసీ కెమెరా స్తంభాన్ని ఢీకొట్టి ఆగిపోయింది. అయితే కారులో ఎయిర్ బెలూన్స్ తెరుచుకోవడంతో ప్రయాణికులకు నష్టం జరగలేదు. తమిళనాడు రాష్ట్రం మధురైకి చెందిన భార్య,భర్త, ఇద్దరు పిల్లలు పుణ్యక్షేత్రాలు సందర్శించటంలో భాగంగా విశాఖపట్నం నుంచి పూరి జగన్నాథస్వామి దర్శనానికి వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. విషయం తెలుసుకున్న 1033 సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి వెళ్లి బాధితులను సోంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కారులో ప్రయాణిస్తున్న కుటుంబపెద్ద సత్తెవేలు నబిరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కంచిలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైఎస్ జగన్‌ను కలిసిన జిల్లా నాయకులు


మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మాజీ శాసన సభాపతి తమ్మినేని సీతారాం, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎన్ని ధనుంజయరావు, భవానీశంకర్ శుక్రవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలో పార్టీ స్థితిగతులపై చర్చించారు. – శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ)

సవాళ్లను అధిగమిస్తేనే ఉజ్వల భవిష్యత్

శ్రీకాకుళం రూరల్: వృత్తిలో ఎదురయ్యే సవాళ్లను అధిగమిస్తేనే హెచ్‌ఆర్ మేనేజర్లుగా రాణించగలమని స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ సీఈఓ ఇంతిరాజ్ అర్షద్ అన్నారు. హెచ్‌పీసీఎల్ స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్, బొల్లినేని మెడిస్కిల్ ఆధ్వర్యంలో రాగోలు జెమ్స్ ఆస్పత్రిలో శుక్రవారం హెచ్‌ఆర్ లీడర్‌షిప్ డెవలప్‌మెంట్ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నేవల్ డాక్‌యార్డు హెచ్‌ఆర్ మేనేజర్ కమాండర్ అర్జున్ రాధాకృష్ణ మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఏఐ టెక్నాలజీపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎల్‌వీజీ దక్షిణాసియా మాజీ సీఎఫ్‌వో గిరధన్ మాట్లాడుతూ మానవ వనరుల అభివృద్ధిలో మేనేజర్లు కీలక పాత్ర పోషిస్తున్నారని చెప్పారు. బొల్లినేని మెడిస్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు మాట్లాడుతూ కంపెనీల అవసరాలకు అనుగుణంగా వేలాది మందికి ఉచితంగా నైపుణ్య శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆస్పత్రుల హెచ్‌ఆర్ మేనేజర్లు, ఎస్‌డీఐ, సిబ్బంది పాల్గొన్నారు.


ఎస్‌డీఐ సీఈఓ ఇంతిరాజ్ అర్షద్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు


కిరాణా దుకాణంలో చోరీ

టెక్కలి: టెక్కలి పాత జాతీయ రహదారిలో పాలకేంద్రం సమీపంలో చిరంజీవి కిరాణా దుకాణంలో బుధవారం రాత్రి చోరీ జరిగింది. వెనుక భాగం నుంచి దుండగులు చొరబడి రూ.80 వేల నగదు, అర తులం బంగారం చెవి దిద్దులను చోరీ చేశారు. ఎటువంటి ఆనవాళ్లు దొరక్కుండా కారం చల్లినట్లు బాధితులు చెబుతున్నారు. ఈ ఘటనపై దుకాణ యజమాని చిరంజీవి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వడ్డీ కట్టాలంటూ మెసేజ్‌లు

- గార ఎస్‌బీఐ ఖాతాదారుల్లో ఆందోళన

గార: మండల కేంద్రంలోని గార స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచిలో బంగారం కుదువపెట్టిన ఖాతాదారులకు తీసుకున్న రుణాలకు రెన్యువల్ పేరిట వడ్డీలు చెల్లించాలంటూ సెల్‌ఫోన్ మెసేజ్‌లు వస్తుండటంతో ఆందోళన చెందుతున్నారు. బ్యాంకులో గతేడాది నవంబర్ చివరి వారంలో బంగారం మాయమైన ఉదంతం వెలుగులోకి వచ్చిన సంగతి తెలిసిందే. కొద్ది రోజుల తర్వాత బంగారం అంతా దొరికిందని, బ్యాంకులో ఉంచామని అధికారులు ప్రకటించారు. తిరిగి లాకర్లులో పదిలపరిచామని చెప్పారు. అయితే ఖాతాదారులు మాత్రం విడిపించేందుకు వెళ్తున్నా కోర్టు పరిధిలో ఉన్నాయని, న్యాయపరంగా తేలిన తర్వాతే బంగారు వస్తువులు ఇస్తామని ఇంతవరకు చెప్పుకుంటూ వస్తున్నారు. ఈ తరుణంలో గత రెండు రోజులుగా రెన్యువల్, వడ్డీలు కట్టాలంటూ బంగారం కుదువ పెట్టిన ఖాతాదారులకు బ్యాంకు నుంచి మెసేజ్‌లు వస్తుండటంతో ఖాతాదారుల్లో అయోమయం నెలకొంది. కొర్లాపు వెంకటరావు, బానాల నీలవేణిలకు తనఖా పెట్టిన రెండు ఖాతాలకు సంబంధించి వడ్డీ కట్టాలని, రెన్యువల్ చేసుకోవాలని రెండు మెసేజ్‌లు వచ్చాయి. శుక్రవారం బ్యాంకుకు వెళ్లి రుణం, వడ్డీ కట్టేస్తామని తమ బంగారాన్ని ఇచ్చేయాలని అధికారులను కోరగా, కోర్టు పరిధిలో ఉందని వస్తువులు ఇవ్వలేమని సమాధానం ఇవ్వడం గమనార్హం.


బ్యాంకు నుంచి ఖాతాదారుల సెల్ ఫోన్‌కు వచ్చిన మెసేజ్‌లు

బస్సు చక్రాల కింద నలిగిన ప్రాణం

- ఆర్టీసీ బస్సు ఢీకొని రెండున్నరేళ్ల చిన్నారి మృతి

కంచిలి: మండలంలోని ముండ్ల గ్రామంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రెండేళ్ల నాలుగు నెలల వయసున్న బాలుడు చనిపోయాడు. కుంబరినౌగాం నుంచి సోంపేటకు వస్తున్న ఆర్టీసీ బస్సు ముండ్ల గ్రామంలో వెళ్తుండగా బస్సు వెనుక చక్రాల కింద పడి దివ్యాంశ్ ప్రధాన్ అనే చిన్నారి దుర్మరణం పాలయ్యాడు. బాలుడు ఎదురింట్లోకి ఆడుకోడానికి వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ బాలుడు గ్రామానికి చెందిన బసంత్ ప్రధాన్, సంగీత చౌదరిల రెండో కుమారుడు. పెద్ద కుమారుడు డీజీ పురం గ్రామంలో గల ఒక ప్రైవేటు పాఠశాలలో చదువుతున్నాడు. పెద్దబ్బాయిని స్కూల్‌కు పంపే హడావుడిలో తల్లి సంగీత ఉండగా ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. తండ్రి బసంత్ ప్రధాన్ స్వగ్రామం ఒడిశా రాష్ట్ర పరిధి జక్కర గ్రామం. ఆయన విదేశాల్లో కార్మికుడిగా పనిచేస్తున్నారు. తల్లి పిల్లలు ముండ్లలో తాత గారింట్లో ఉంటున్నారు. తల్లి ఫిర్యాదు మేరకు స్థానిక ఎస్ఐ జి.రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాలుని మృతదేహానికి సోంపేట ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం చేపట్టారు.


దివ్యాంశ్ ప్రధాన్(ఫైల్)